క్లుప్తంగా

ఓటరుకు అస్వస్థత



108లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

గోపాలపట్నం: గోపాలపట్నం 278 బూత్ పరిధిలో ఓటు వేసేందుకు వచ్చిన ఒక ఓటర్ అస్వస్థతకు గురయ్యాడు. దీంతో పోలింగ్ అధికారులు 108 వాహనం ద్వారా ఆస్పత్రికి తరలించారు. ఓటు వేసేందుకు బూత్ వద్దకు వచ్చే సరికి ముక్కు వెంబడి రక్తం కారడంతో అక్కడున్న వైద్య శిబ్బంది సపర్యలు చేశారు. అనంతరం 108లో ఆస్పత్రికి తరలించారు. అయితే ఓటరు వివరాలు బయటకు రాలేదు.

16 నుంచి ఐఈటీఈ సాంకేతిక ఉత్సవం

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగానికి అనుబంధంగా గల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజినీర్స్ (ఐఈటీఈ) ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సాంకేతిక యువజనోత్సవం ఐస్క్వేర్ ఆర్ – 2023 నిర్వహిస్తున్నట్లు విభాగం అధిపతి ప్రొఫెసర్ జె.బి.సెవెన్త్‌లైన్ తెలిపారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టుల ప్రదర్శనతోపాటు సాంకేతిక అంశాలపై నిపుణులు ప్రసంగిస్తారన్నారు.

సమస్యల సాధనకు ఉద్యోగుల నిరసన

మహారాణిపేట : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాల్గవ తరగతి ఉద్యోగులు సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం నేడు అయిదో రోజుకు చేరుకుంది. ఏపీజేఏసీ పిలుపు మేరకు ఈ కార్యక్రమం కొనసాగుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉన్న రెవెన్యూ సిబ్బంది, నాల్గవ తరగతి ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సమస్యల సాధనకు పోరాటం సాగిస్తామని సంఘం జిల్లా అధ్యక్షుడు నమ్మి శ్రీనివాసరావు అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సహ అధ్యక్షుడు లోకేశ్వరరావు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

అక్కిరెడ్డిపాలెం: పద్మశాలి సంఘం సమావేశం జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో జరిగింది. మార్కండేయ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు జాగారపు శ్రీనివాసరావు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పప్పు రాజారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ పద్మశాలీల సమస్యలను ఐక్యతతో పరిష్కరించుకోవాలని తెలిపారు. అనంతరం సంఘం నాయకులను ఘనంగా సన్మానించారు. గౌరవ అధ్యక్షుడు నావాన సింహాచలం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కొల్లి కుంచారావు, జి.అప్పారావు, పి.కనకారావు, ఎస్.సంతోష్, ఎం.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్ల రచనలు ఆదర్శం

పరవాడ: రామాయణాన్ని సంస్కృతం నుంచి తెలుగులో అనువదించిన తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్ల జయంతిని సోమవారం గొర్లివానిపాలెం కాలనీలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ గొర్లి గోపిఅమ్మలు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, జిల్లా కుమ్మరి సాలివాహన సంఘ అధ్యక్షుడు కొత్తూరు గెడ్డప్ప తదితరులు మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సర్పంచ్ గొర్లి గోపీఅమ్మలు మాట్లాడుతూ అగ్రవర్ణాలను ఎదురించి పోరాటాలు చేసి చదువు సాగించి రామాయణాన్ని రచించిన ఘనత మొల్లకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ డి.అర్జున వెంకటరావు, ప్రధాన కార్యదర్శి ఎ.రామస్వామి, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు కె.కనకారావు, జిల్లా కార్యదర్శి భాస్కరరావు, అనకాపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మల్కాపురం పోలింగ్ కేంద్రం వద్ద ఓటరు జాబితా పరిశీలిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్



ఓటు వేసేందుకు వచ్చిన గర్భిణిని వాహనం సాయంతో పంపిస్తున్న సీఐ లూథర్‌బాబు



గుల్లలపాలెం వద్ద ఓటర్ లిస్టులో పేరును పరిశీలిస్తున్న బద్రీనాథ్, కార్పొరేటర్ సురేష్ తదితరులు



బుచ్చిరాజు పాలెంలో ఓటు వేసేందుకు వెళ్లిన తల్లిదండ్రుల కోసం వేచి ఉన్న చిన్నారులు

ప్రశాంతంగా పోలింగ్

- ‘పశ్చిమ’లో సజావుగా ఎమ్మెల్సీ ఎన్నికలు
- బారులు తీరి ఓటేసిన పట్టభద్రులు



273 బూత్ వద్ద సూచనలిస్తున్న డీసీపీ-2 ఆనంద్‌రెడ్డి, సీఐ లూథర్‌బాబు తదితరులు



శిబిరం వద్ద డిప్యూటీ మేయర్ శ్రీధర్‌తో మాట్లాడుతున్న సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: ఎమ్మెల్సీ ఎన్నికలు పశ్చిమ నియోజకవర్గంలో సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం పోలింగ్ మందకొడిగా సాగింది. పలు సెక్టార్లలో ఉద్యోగులకు మధ్యాహ్నం నుంచి మినహాయింపు ఇవ్వడంతో ఓటర్లు ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలి రావడంతో రద్దీ నెలకొంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరడం చూసి మధ్యాహ్నం 3.30 గంటల తర్వాత వచ్చిన కొంతమంది ఓటర్లు వెనుదిరిగారు.

పర్యవేక్షించిన అధికారులు

ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేంద్రాల వద్ద పరిస్థితిని డీసీపీ-2 ఆనంద్‌రెడ్డి, హార్బర్ ఏసీపీ శిరీష,సీఐ లూథర్‌బాబు సమీక్షించారు. గుంపులు గుంపులుగా ఉన్న వారిని చెందర గొట్టారు. టీడీపీకి చెందిన కొంత మంది కార్యకర్తలు 273 కేంద్రం వద్ద ప్రచారం చేస్తుంటే వారిని గాజువాక పోలీసులు చెదర గొట్టారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్‌కుమార్ 273,274,275 పోలింగ్ కేంద్రాల వద్ద ఓటింగ్ సరళిని అక్కడ నాయకులను అడిగి తెలుసుకున్నారు.

ఉత్సాహంగా పోలింగ్

గోపాలపట్నం: ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలు గోపాలపట్నం, బుచ్చిరాజుపాలెంలో ప్రశాంతంగా జరిగింది. ఉదయం 8 గంటలకే పోలింగ్ బూతులకు ఓటర్లు చేరుకున్నారు. పోలింగ్ స్టేషన్‌కు 200 మీటర్ల పరిధిలో ఎవరూ గుమిగూడకుండా భద్రతా ఏర్పాట్లు చేశారు. ఉదయం కొంత ఓటర్ల తాకిడి ఉన్నా మధ్యాహ్నం మందగించింది. సాయంత్రం ఓటర్ల తాకిడి పెరిగింది.

బూత్‌ల వారీ ఓటింగ్ ఇలా..

గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో 277 పోలింగ్ బూత్‌లో మొత్తం ఓట్లు 1053 కాగా 776 పోలయ్యాయి.

- 277ఏ లో 719 ఓట్లకు 419 పోలయ్యాయి.
- 278పోలింగ్ బూత్‌లో 1084 ఓట్లకు గాను 661ఓట్లు పోలయ్యాయి.
- 278ఏలో 472 ఓట్లకు గాను 401 ఓట్లు పోలయ్యాయి. ఈ నాలుగు బూతుల్లో 3328 ఓట్లు పోలయ్యాయి.
- బుచ్చిరాజుపాలెం సెయింట్ ఆన్స్ పాఠశాలలో 276 పోలింగ్ బూత్‌లో మొత్తం ఓట్లు 758 కాగా 508 పోలయ్యాయి.
- 276ఏ పోలింగ్ బూత్‌లో1049 ఓట్లకకు గాను 762 ఓట్లు పోలయ్యాయి. నాలుగు గంటలు దాటిన తర్వాత వచ్చిన వారు నిరాశతో వెనుతిరిగారు
- 273 పిలకవానిపాలెం పోలింగ్ కేంద్రం వద్ద 1110 ఓటర్లకు గానూ సరాసరి 930 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- 275 పోలింగ్ కేంద్రంలో(మల్కాపురం జీవీఎంసీ పాఠశాల వద్ద) 1289 మంది ఓటర్లకు గానూ 812 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈకేంద్రం వద్ద ఉదయం నుంచి రద్దీ కొనసాగింది.
- 274 (గాంధీగ్రామ్ జీవీఎంసీ పాఠశాల వద్ద) పోలింగ్ కేంద్రం వద్ద 1070 మందికి గానూ దాదాపు 940 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

కంచరపాలెంలో..

కంచరపాలెం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కంచరపాలెం ఆర్పీపేట ప్రాథమిక పాఠశాలలో సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఆర్పీపేటలో 265, 265ఎ, 266, 266ఎ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 46, 47,48, 54,55, 56 వార్డులకు సంబంధించిన పట్టభద్రులు తమ ఓటును వినియోగించుకున్నారు. ఆర్పీపేట ప్రాథమిక పాఠశాల ఆవరణ సరిపడకపోవడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. పలు పార్టీ నాయకులు బయట టెంట్లు వేసి ఓటర్లకు స్లిప్‌లు అందజేశారు.వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆయా పోలింగ్ సరళిని పరిశీలించారు.

40వ వార్డులో..

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు సింథియా న్యూకాలనీలోని గాంధీగ్రామం ప్రభుత్వ పాఠశాలలోని 274 వ నెంబర్ పోలింగ్ బూత్ 1290 ఓట్లకు గానూ 902 ఓట్లు పోలయ్యాయి. వీటిలో పురుషులు 396 మంది, మహిళలు 506 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 64.30 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ సరళిని పశ్చిమ వైఎస్సార్‌సీపీ కన్వీనర్, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ పరిశీలించారు. మల్కాపురం సీఐ లూథర్‌బాబు పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించారు.



తొలిసారి ఓటు వేసిన స్వాతి, రవి



గోపాలపట్నం హైస్కూల్లో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే గణబాబు



ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ బూత్‌లో బారులు తీరిన పట్టభద్రులు

మొదటి సారి ఓటు వేశా..



మొదటి సారి ఓటు హక్కును వినియోగించుకోవడం గర్వంగా ఉంది. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా నాయకులను ఎన్నుకోవడం నేర్చుకుంటున్నాను. ఓటు వేసేప్పుడు కొంత బయపడిన పోలింగ్ సిబ్బంది సహకరించడంతో ధైర్యంగా ఓటు వేశాను.

– సేనాపతి శ్రావణి

నేటి నుంచి డీ-వార్మింగ్ మాత్రల పంపిణీ



బుచ్చిరాజుపాలెం ఆరోగ్య కేంద్ర సిబ్బందికి సూచనలిస్తున్న వైద్యులు

గోపాలపట్నం: బుచ్చిరాజుపాలెం, చంద్రానగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల(యూపీహెచ్‌సీ) పరిధిలో ఈ నెల 14 నుంచి నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు వైద్యులు కె.వికాశ్, సీహెచ్ దీపిక తెలిపారు. బుచ్చిరాజుపాలెం ఆరోగ్య కేంద్రంలో సోమవారం సిబ్బందికి ఈ కార్యక్రమంపై వారు సూచనలిచ్చారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో అల్బెండజోల్ మాత్రలు అందిస్తామని చెప్పారు. 89వ వార్డులో 4,296 మంది, 90వ వార్డులో సుమారు 14,890 మంది కిషోర బాలిక, బాలురు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. వారందరికీ ఈ మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల ఉపాధ్యాయులు పాల్గొని సహకరించాలని వైద్యులు కోరారు. సామాజిక ఆరోగ్యాధికారి సాంబమూర్తి, సచివాలయం ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

760వ రోజుకు ‘ఉక్కు’ దీక్షలు



760వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 760వ రోజుకు చేరుకున్నాయి. ఈ శిబిరంలో ప్లాంట్‌లోని పలు విభాగాలకు చెందిన కార్మికులు కూర్చుని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశ ప్రజలు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి ప్రభుత్వరంగ సంస్థల జోలికి రాకుండా ఉంటే మంచిదన్నారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రకటించాలని, లేదంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు.

మహిళా దినోత్సవ సందడి



వేడుకలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు



నృత్య ప్రదర్శనలో పాల్గొన్న బాలికలు

సీతంపేట: శారదా స్వర సంగమం ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికలు ఆటపాటలతో సందడి చేశారు. సంస్థ అధ్యక్షుడు లోకేష్ ఆధ్వర్యంలో పలువురు గాయనీ గాయకులు కరోకి ట్రాక్ సాంగ్స్ ఆలపించి అలరించారు. మహిళలు ప్రతిభా ప్రదర్శనలతో, చిన్నారుల నృత్యాలతో కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. వేడుకల్లో ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రా ఆర్టిస్ట్స్ డైరెక్టర్ సన్‌మూర్తి, గాయకులు వి.రామ్‌కుమార్, బాలాజీ, ధనలక్ష్మి, సాత్విక, రేణుక, రవిచంద్ర, గీత, లక్ష్మి, స్వరూప, కవిత తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార రైతుబజార్‌లో తనిఖీలు



రైతుబజార్‌లో తనిఖీ చేస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో సోమవారం జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ ఆకస్మిక తనిఖీలు చేశారు. రైతుల స్టాళ్ల వద్దకు వెళ్లి ఐడీ కార్డులు, ధరల పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుబజార్‌ను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో వినియోగదారులు కూరగాయలు కొనుక్కునేలా చూడాలని, సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. కూరగాయల విక్రయాల్లో ఎటువంటి అవకతవకలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. వినియోగదారులతో స్నేహపూర్వకంగా మెలగాలని రైతులకు సూచించారు. డ్వాక్రా స్టాళ్లలో సంబంధిత మహిళలే ఉండాలన్నారు. ఆకుకూరల రైతులు యాసిన్‌కు తమ సమస్యలు విన్నవించుకున్నారు. రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణలో విఫలం



మానవ హక్కుల పరిరక్షణకు సంబంధించి గణాంకాలు చూపుతున్న శ్యాంప్రసాద్

దాబాగార్డెన్స్: మానవ హక్కుల పరిరక్షణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయని మానవ హక్కుల కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి కారణంగానే తరచూ మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయన్నారు. దీనిని అరికట్టేందుకు ప్రభుత్వాలు పటిష్ట చర్యలు తీసుకోవల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ల పనితీరు దారుణంగా ఉందన్నారు. ఆ కమిషన్ల వల్ల ప్రజలకు పెద్దగా ప్రయోజనాలు చేకూరడం లేదన్నారు. మానవ హక్కుల్లో ప్రధానంగా జీవించే హక్కుని ప్రజలు కోల్పోతున్నారని అన్నారు. భావితరాలు మనుగడ సాధించాలంటే పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు.

డంపింగ్ యార్డును పరిశుభ్రంగా ఉంచండి

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 పరిధిలోని కాపులుప్పాడ డంపింగ్ యార్డు, చెత్త నుంచి విద్యుత్ తయారు చేస్తున్న జిందాల్ విద్యుత్ ప్లాంట్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా తక్షణ చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. జీ 20 సదస్సుకి వచ్చే వివిధ దేశాల ప్రతినిధులు ఇక్కడకు రానున్నందున అధికారులతో కలిసి సోమవారం ఆయన క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. ఇప్పటికే నగరంలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. పలు దేశాల ప్రతినిధులు నగరంలోని ప్రాజెక్టులు వీక్షిస్తారని, అందుకు ఆయా ప్రాంతాలను మరింత శుభ్రంగా ఉంచాలని సూచించారు. జిందాల్ విద్యుత్ ప్లాంట్ వద్ద టాయిలెట్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, పారిశుద్ధ్య పనులు పక్కాగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ వి.సన్యాసిరావు, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

పైడిమాంబ జాతర నేడు



విద్యుత్ దీపాల అలంకరణలో నడుపూరు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు గ్రామదేవత పైడిమాంబ అమ్మవారి జాతర మంగళవారం జరగనుంది. ఆలయంతో పాటు గ్రామంలోని ప్రధాన రహదారిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారి ఆలయానికి వెళ్లే రోడ్డులో ప్రత్యేకంగా ఆర్చ్‌లను తీర్చిదిద్దారు. జాతరలో భాగంగా ఉత్సవ కమిటీ చైర్మన్లు ములగపాక అచ్చింనాయుడు, మంత్రి శంకరనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ 7న ఉత్సవాలకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు చేయడంతో పాటు ఘటాలను వీధుల్లో ఊరేగిస్తున్నారు. జాతరను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ రాయభారం, సత్యహరిశ్చంద్ర తదితర నాటకాలతో పాటు పిట్టలదొర అనే హాస్యవల్లరి, సినీ డూప్స్, బుర్రకథ, రేలారే రేలా తదితర కార్యక్రమాల ప్రదర్శనలు అలరించాయి. జాతరకు ముందు రోజు సోమవారం సాయంత్రం నుంచి పరస ప్రారంభమైంది. మంగళవారం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారి అనుపు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు.

ఆధ్యాత్మికం

నమో శివరుద్రాయ



ఉమాచంద్రమౌళేశ్వరస్వామి

సింహాచలం: విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. బిల్వ పత్రాలతో పూజలు చేశారు. ఉమాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమపూజలు నిర్వహించారు. శివ నామస్మరణలో మునిగితేలారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్ కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

వైభవంగా నిత్యకల్యాణం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

నేడు పోలిపిల్లమ్మ వార్షిక పండగ

- విశేషంగా ఏర్పాట్లు



సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు పరిధి అప్పన్నపాలెం వాసుల ఆరాధ్యదేవత పోలిపిల్లమ్మ తల్లి వార్షిక పండగను మంగళవారం విశేషంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు పీతల విష్ణుమూర్తి తెలిపారు. ఆలయం వద్ద భక్తులకు మజ్జిగ ,ప్రసాద వితరణ చేస్తున్నట్టు చెప్పారు. రాత్రి అనుపు మహోత్సవాన్ని పురస్కరించుకుని గరగల డ్యాన్స్, బాణసంచా భారీ ఎత్తున కాల్చడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం నుంచి మూడు వేదికలపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పండగ నేపథ్యంలో అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆలయ కమిటీ కార్యదర్శి ఉరివిడి ఈశ్వరరావు, ట్రెజరర్ నూనెల దేముడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కనకమహాలక్ష్మికి నేడు అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి.